క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం



స్వామి వారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మేయర్ దంపతులు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద గురువారం రాత్రి దాసాంజనేయ స్వామి వారి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో శ్రీసీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మేయర్ సామల బుచ్చిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, ఆభరణాలను స్వామి వారికి సమర్పించారు. కల్యాణోత్సవంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు చీరాల నర్సింహ, సింగిరెడ్డి పద్మారెడ్డి, నేతలు కొత్త రవిగౌడ్, బందారం శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రభారతిలో చిన్నారుల స్నాతకోత్సవం



మేడిపల్లి: రవీంద్రభారతి స్కూల్ బోడుప్పల్ బ్రాంచిలో శుక్రవారం చిన్నారుల స్నాతకోత్సవం సందడిగా సాగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైకోర్టు అడ్వకేట్ జ్యోతిరెడ్డి హాజరై విద్యార్థులకు పతకాలు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. అనంతరం చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డీన్ ప్రమీల, ప్రిన్సిపాల్ రజిత తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సునీత యాదవ్, సర్కిల్ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం శనివారం మల్కాజిగిరిలోని లక్ష్మీసాయి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. శుక్రవారం ఆమె లక్ష్మీసాయి గార్డెన్స్‌లో జరిగే ఆత్మీయ సమ్మేళనం స్థలాన్ని బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. శనివారం ఉదయం మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు శంభీపూర్ రాజు, ఎమ్మెల్సీ, ఇన్‌చార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి హాజరవుతారన్నారు.

నిధులు మంజూరు చేయండి



మేయర్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలో నాలా విస్తరణకు నిధులు మంజూరు చేయాలని నగర మేయర్ విజయలక్ష్మిని కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. శుక్రవారం వినతిపత్రం అందజేసిన కార్పొరేటర్ మాట్లాడుతూ గీతానగర్ గౌతం మోడల్ స్కూల్ నుంచి సరికొండ నర్సింహారెడ్డి గార్డెన్స్ వరకు నాలా విస్తరణ చేయడంతో ముంపు సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. నాలా నిర్మాణానికి సుమారు రూ.2 కోట్లు ఖర్చు అవుతాయని ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు.

ముగిసిన ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూకు హాజరైన దరఖాస్తుదారులు

మల్కాజిగిరి: తెలంగాణ స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ నుంచి రుణం పొందడానికి దరఖాస్తు చేసుకున్న వారికి శుక్రవారం ఇంటర్వ్యూలు ముగిశాయి. సర్కిల్ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలో దరఖాస్తుదారుల ధ్రువీకరణ ప్రతాలను పరిశీలించారు. బ్యాంక్ ఖాతా వివరాలతో 736 మంది, ఖాతా వివరాలు లేకుండా 248 మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన వారి జాబితా తర్వాత ప్రకటిస్తామని ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జున్‌రావు తెలిపారు.

రెండేళ్ల ప్రాజెక్టు.. ఐదేళ్లయినా అసంపూర్తిగానే..



ఉప్పల్ కమాన్ వద్ద వరంగల్ జాతీయ రహదారి పక్కన నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు, శివారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ రజిత తదితరులు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- కేవలం అధికారం కోసం పాకులాడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 15 మంది ప్రాణాలు కోల్పోయారు
- ఇలాగే అలసత్వం వహిస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు
- ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో జాప్యంపై కాంగ్రెస్ నిరసన

ఉప్పల్: ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో జాప్యానికి నిరసనగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును తప్పుబడుతూ ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉప్పల్ కమాన్ వద్ద పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరసన తెలిపారు. దాదాపు గంటపాటు వరంగల్ జాతీయ రహదారి పక్కన బైటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ మందముల రజితరెడ్డి, మేకల శివారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ టు నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం రెండు సంవత్సరాల్లో పూర్తి కావాల్సి ఉండగా ఐదు సంవత్సరాలు పూర్తియినా నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ భూములు కోల్పోయిన వారికి పరిహారం అందజేయలేదన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం కారణంగా గతుకుల రోడ్లతో దాదాపు 15 మంది వరకు ప్రాణాలు పోగొట్టుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే విధానాన్ని అవలంభిస్తున్నాయని, కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయే తప్ప ప్రజాసమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. నిర్మాణానికి నిధులున్నా పనులు చేయడం లేదని వారు ఆరోపించారు. ఒకరినొకరు దోషులుగా చూపుకుంటున్నారే తప్ప సమస్యను పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే అలసత్వం వహిస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలను, ప్రజాసంఘాలను కూడగట్టుకుని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్‌రెడ్డి, తవిడబోయిన గిరిబాబు, ఎండీ తౌఫిక్, తెల్కల మోహన్‌రెడ్డి, బోరంపేట కృష్ణ, చెన్‌రెడ్డి రఘుపతిరెడ్డి, కాలేరు జైనమీన్, భాస్కర్‌రెడ్డి, ఆకారపు అరుణ్, దేవిరెడ్డి, కొంపల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫైర్‌సేఫ్టీపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

ఉప్పల్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ఫైర్‌సేఫ్టీ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. రూల్స్ పాటించనివారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. మహానగరంలో వరుసగా జరిగిన అగ్ని ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు, ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారి తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రతి వ్యాపారి, దుకాణదారుడు మే నెల 31 నాటి వరకు ఫైర్ మిటిగేషన్ విధిగా పొందాల్సిందేనని తెలిపారు. ఎలాంటి యూజర్ చార్జీలు లేకుండా ఆన్‌లైన్ ద్వారా జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్లను పొందవచ్చని చెప్పారు.



అరుణకుమారి, ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

సెల్లార్లలో కేవలం పార్కింగ్ మాత్రమే..

బహుళ అంతస్తుల సెల్లార్లలో పార్కింగ్ తప్ప ఎలాంటి ఇతర వ్యాపార కార్యకలాపాలు చేయకూడదన్నారు. వాటిపై కూడా దృష్టి సారించి కఠినంగా వ్యవహరించనున్నట్లు చెప్పారు. బహుళ అంతస్తుల్లో అత్యవసర ద్వారాల సూచిక బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని, దారికి అడ్డుగా ఎలాంటి వస్తువులు ఉంచకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే పలు వ్యాపార సంస్థల యాజమానులకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు.

అధికారుల అలసత్వంతో పనులు పెండింగ్



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

అధ్వానమైన రోడ్లను నిరసిస్తూ కార్పొరేటర్ ధర్నా

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా ఉండటాన్ని నిరసిస్తూ అధికార పార్టీ, 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశయాదవ్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు టీఆర్ఎస్ నేతలు, వివిధ కాలనీల ప్రతినిధులు, మహిళలు సంఘీభావం తెలిపి ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాసాల వెంకటేశ్‌యాదవ్ మాట్లాడుతూ ప్రధాన రహదారులన్నీ గుంతలమయమై వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. మంత్రి చామకూర మల్లారెడ్డి శంకుస్థాపనలు చేసినా అధికారుల అలసత్వంతో పనులు పెండింగ్ పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడేళ్లుగా మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులపై 258 తీర్మానాలు చేసి పాలకవర్గం ఆమోదించిందన్నారు. అనంతరం కమిషనర్ వాణిరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యురాలు బద్దుల సుగుణ, నేతలు కామగల్ల నర్సింహ, పడతం లోకేష్, బొమ్మక్ శ్రీనివాస్, మిట్టపల్లి సురేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూజీడీ పనులపై సమీక్ష

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులపై శుక్రవారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సమీక్ష చేశారు. డివిజన్ పరిధిలో నెలకొన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలతో పాటు కొత్త పైప్‌లైన్ పనులపై ఏఈ రోహిత్‌తో చర్చించారు. అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అవసరమైన కాలనీలను గుర్తించామని, అనుమతులు లభించగానే సాధ్యమైనంత త్వరగా పనులు జరిగేలా చూస్తామన్నారు.

ఎమ్మెల్సీలకు అభినందనలు



ఎమ్మెల్సీలను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

హబ్సిగూడ: ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికైన దేశపతి శ్రీనివాస్, కుర్మయ్యగారి నవీన్‌కుమార్, చల్లా వెంకటరాంరెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీఆర్ఎస్ నాయకులు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, గడ్డం రవికుమార్, గరిక సుధాకర్ తదితరులు ఉన్నారు.

యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాలి



ఉప్పల్: చిలుకానగర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిట్టల నరేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ విప్, శాసన మండలి సభ్యుడు శంభీపూర్ రాజును చిలుకానగర్ పార్టీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సత్కరించారు. స్థానిక సమస్యలను పరిష్కరించే విధంగా, యువతకు మరిన్ని అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని కోరినట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అల్వాల్: చికిత్స పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. 27వ తేదీన మచ్చబొల్లారంలోని శృతి వైన్స్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు అల్వాల్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని సుమారు 55 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి ఈ నెల 28వ తేదీ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బంధువులు ఎవరైనా ఉంటే ఉంటు అల్వాల్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

పరీక్షలను ఏకాగ్రతతో రాయాలి

బోడుప్పల్: విద్యార్థులు ఏకాగ్రతతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాల 10వ తరగతి వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులు సంపాదించే దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలి



బండరాళ్ల తొలగింపునకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: మీర్‌పేట్-హెచ్‌బీకాలనీ డివిజన్, నవోదయనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా బండరాళ్లను తొలగించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ సూచించారు. శుక్రవారం ఆయన అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ఇంజినీరింగ్ ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ చారి, నాయకులు అశోక్, జయపాల్, పర్వీన్, నరేందర్, కొమురమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి దళిత బంధు ఇవ్వాలి

రామంతాపూర్: రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం రామంతాపూర్ బీజేపీ క్యాంపు కార్యాలయంలో ఉప్పల్ నియోజకవర్గ బీజేపీ దళిత మోర్చా ప్రధాన కార్యదర్శి ఏసూరి యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గంలో దళిత బంధు పథకం అధికార పార్టీకి చెందిన వారికే అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో దళిత మోర్చా నేతలు చంద్రయ్య, సూర్యప్రకాష్, గురుమూర్తి, నాగేష్, వినోద్, మాణిక్యం, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు అధికం, అభివృద్ధి శూన్యం



వెంకటాపురం శివనగర్‌లో నందికంటి శ్రీధర్ పాదయాత్ర

అల్వాల్: మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యలు అధికం, అభివృద్ధి శూన్యమని కాంగ్రెస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. వెంకటాపురం డివిజన్‌లో శివనగర్‌లో శుక్రవారం జరిగిన జోడో యాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. పాదయాత్రలో ప్రజలు సమస్యలను వెల్లడించారన్నారు. ఎన్నికల ముందు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పారని, నాలుగేళ్లు పూర్తవుతున్నా నేటికీ అందని ద్రాక్షగానే నిలిచాయన్నారు.

వేసవిలో దాహాన్ని తీర్చేందుకు..



హెచ్‌బీకాలనీలో చలివేంద్రాన్ని ప్రారంభించిన బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్ తదితరులు

కుషాయిగూడ: వేసవిలో దాహాన్ని తీర్చేందుకు ఉప్పల్ నియోజకవర్గంలో పెద్దఎత్తున చలివేంద్రాల కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నేత, బీఎల్ఆర్ ట్రస్టు చైర్మన్ బండారి లక్ష్మారెడ్డి అన్నారు. హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్ కూడలిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. బీఎల్ఆర్ ట్రస్టు ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి, స్థానిక నేతలు పూస రమేష్, దూసరి నవీన్‌గౌడ్, గడియారం రామకృష్ణ, సముద్రాల కృష్ణమూర్తి, కృష్ణవేణి, ఫర్వీన్, శోభ, కుమార్, శంకర్, సాయిగౌడ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ చంద్రయ్య సేవా సమితి ఆధ్వర్యంలో..

మల్లాపూర్: ఎస్వీ చంద్రయ్య సేవా సమితి ఆధ్వర్యంలో సేవా సమితి ఫౌండర్ ఎస్వీకిట్టు ఓల్డ్ మల్లాపూర్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల దాహార్తిని తీర్చేందుకు 13 ఏళ్లుగా చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజ్‌కుమార్ యాదవ్, సోనీగౌడ్, లక్ష్మీ, ప్రవీణ్, శివ, గంగాధర్, రవీందర్ పాల్గొన్నారు.

బోడుప్పల్ వార్షిక బడ్జెట్ రూ 69.78 కోట్లకు ఆమోదం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ సమావేశం శుక్రవారం మేయర్ సామల బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ బడ్జెట్ రూ.69.78 కోట్లకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. ప్రారంభ విలువ రూ.3.83 కోట్లు, ఆస్తి పన్ను రూపంలో వసూలు అంచనా రూ.14 కోట్లు, ఇతర పన్నుల అంచనా రూ.39.88 కోట్లు, డిపాజిట్, అడ్వాన్స్ రూపంలో రూ.1.20 కోట్లతో అంచనా వేసినట్లు మేయర్ సామల బుచ్చిరెడ్డి వెల్లడించారు. అలాగే గ్రాంట్ల రూపంలో రూ.10.85 కోట్లు వస్తాయని అంచనా వేశారు. సొంత ఆదాయం, గ్రాంట్ రూపంలో కలుపుకుని రూ.69.78 కోట్ల అంచనాలతో 2023–24 బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అనంతరం కమిషనర్ వాణిరెడ్డి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో వార్డు వారీగా సమస్య తీవ్రత ఆధారంగా అభివృద్ధి పనులను చేపడతామన్నారు. నగర పాలకసంస్థ ఆదాయ వనరులను పెంచే విధంగా చర్యలు చేపడతామని వెల్లడించారు. అందుకు పాలకవర్గం, ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, మేనేజర్ మంజులత, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదివితే.. ఏదైనా సాధ్యం



విద్యార్థులకు హాల్‌టికెట్లను అందజేస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి: విద్యార్థులు ఇష్టపడి పట్టుదల, ఏకాగ్రతతో చదివినప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధి మేడిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తవుతున్న విద్యార్థులకు శుక్రవారం ఫేర్‌వెల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డితో కలిసి విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఇష్టంతో చదివితే ఏదైనా సాధించవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ఉపాధ్యాయులు, నాయకులు మనోరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో వేగం పెంచండి

మల్కాజిగిరి: రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రాజెక్ట్ విభాగం అధికారులకు సూచించారు. హనుమాన్‌నగర్ రహదారి నుంచి మౌలాలి కమాన్ వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మౌలాలి కమాన్ విస్తరణకు ఉన్న అడ్డంకులు ఎమ్మెల్యే చొరవతో తొలగిపోయాయన్నారు. ఇరువైపులా రహదారి నిర్మాణం పూర్తయితే రాకపోకలను ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్‌రావు, శ్రీనివాస్, కిషోర్, భాస్కర్ పాల్గొన్నారు.

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో అన్నదానం

విజయవంతం చేసిన భక్తులకు ధన్యవాదాలు

మేడిపల్లి: శ్రీరామనవమిని పురస్కరించుకుని గురువారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీరాంజనేయ దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా భారతి సిమెంట్, సవేర ఏజెన్సీస్ మేడిపల్లి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. వందలాదిగా భక్తులు హాజరై అన్న ప్రసాదాలను స్వీకరించారు. భారతి సిమెంట్ యాజమాన్యం శుక్రవారం ఓ సమావేశంలో మాట్లాడుతూ.. అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులకు, ఆలయ కమిటీకి, పాలకవర్గానికి భారతిసిమెంట్, సవేర ఏజెన్సీస్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.



‘కంటి వెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి

మేడిపల్లి: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి అన్నారు. 4వ డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని కార్పొరేటర్ యాసారం మహేశ్వరి మహేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి సమస్యలు ఉన్న ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ కార్పొరేటర్ మహేశ్వరి, కో ఆప్షన్ సభ్యులు జగదీశ్వర్‌రెడ్డి, రాందాస్‌గౌడ్, నాయకులు పప్పుల అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి ఉత్సవాలు

ఉప్పల్: ఉప్పల సర్కిల్ పరిధిలో శ్రీరామ నవమి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం సాయంత్రం పలు ప్రాంతాల్లో శ్రీరాముడి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మేకల శివారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి తదితరులు హాజరై పూజలు నిర్వహించారు.





మహిళను కాపాడిన పోలీసులు



కాపాడిన పోలీసులు

అల్వాల్: ఆత్మహత్యకు యత్నించిన వివాహితను పోలీసులు కాపాడిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రేష్మ(24) శుక్రవారం సాయంత్రం ఆత్మహత్య చేసుకుంటున్నానని 100 నంబర్‌కు ఫోన్ చేసింది. అప్రమత్తమైన కంట్రోల్ రూమ్ సిబ్బంది అల్వాల్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. కానిస్టేబుల్ భాస్కర్ ఘటన స్థలానికి వెళ్లి రేష్మ గది తలుపులను బలవంతంగా తెరిచి ఆమెను కాపాడాడు. సకాలంలో స్పందించిన పోలీసులకు కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.